ముఖ్యమంత్రి కార్యాలయము

తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-4 19, డిసెంబరు, 2014

హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు ఎలివేటెడ్ కారిడార్లు, స్కైవేస్, మల్టి లెవల్ గ్రేడ్ సపరేటర్స్ నిర్మించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు నిర్ణయించారు. ఇందుకు అవసరమైన ప్రదేశాల ఎంపిక కోసం శుక్రవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు బివి.పాపారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ, జిహెచ్ఎంసి కమీషనర్ సోమేష్‌కుమార్, సిఎంఓ ప్రిన్సిపల్ సెక్రటరి నర్సింగరావు, రవాణా రంగ కన్సల్టెంట్లతో చర్చించారు. నగరంలో పాత బస్తీ, కొత్త బస్తి అనే తేడా లేకుండా ఎక్కడపడితే అక్కడ ట్రాఫిక్ జాంలు అనివార్యమయ్యాయని, ప్రతి జంక్షన్‌లో చాలా సేపు ఎదురుచూడాల్సి వస్తున్నదని ముఖ్యమంత్రి అన్నారు. ఈ పరిస్థితి నివారించడానికి రద్దీ బాగా ఉండే ప్రధాన రహదారులపై స్కైవేస్, ప్రధాన జంక్షన్‌ల వద్ద మల్టి లెవల్ గ్రేడ్ సపరేటర్స్, జిల్లాల నుంచి వచ్చే ట్రాఫిక్‌ను తట్టుకొనేవిధంగా ఎలివేటెడ్ కారిడార్లు నిర్మించడానికి ప్రతిపాదనలు సమర్పించాలని ఇదివరకే ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. కన్సల్టెంట్ల సహాకారంతో అధికారులు ఆ ప్రతిపాదనలను ముఖ్యమంత్రి ముందు పెట్టారు. ఈ సందర్భంగా నగరంలో బాగా రద్దీగా వుండే ప్రాంతాలను గుర్తించారు. నిత్యం ట్రాఫిక్ జాంలు జరిగే, ఎక్కువసేపు ఎదురుచూడాల్సి వచ్చే జంక్షన్లను గుర్తించారు. అక్కడ ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు, సిగ్నల్ కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేకుండా ఎవరి దారిని వారు పోవడానికి వీలయ్యే మల్టిలేవల్ గ్రేడ్ సపరేటర్స్ నిర్మించడంపై చర్చించారు. హరిహర కళాభవన్ నుండి ఉప్పల్ వరకు, మాసబ్ ట్యాంక్ నుండి హరిహర కళాభవన్ వరకు, నాగార్జున సర్కిల్ నుండి మాదాపూర్ వరకు, తార్నాక నుండి ఇసిఐఎల్ క్రాస్‌రోడ్డు వరకు, చార్మినార్ నుండి బిహెచ్ఇఎల్ వరకు... ఇలా నగరంలో దాదాపు 11 స్కైవేలు నిర్మించాలని అధికారులు ప్రతిపాదించారు. స్కైవేల నుండే రోడ్డు మారే ఏర్పాట్లు

ఉండాలని, వాటికి అనుగుణంగా అండర్ వేలు నిర్మించాలని ముఖ్యమంత్రి చెప్పారు. నగరంలోని దాదాపు 35-40 జంక్షన్లలో ట్రాఫిక్ సమస్యను అధిగమించాల్సి ఉందని ముఖ్యమంత్రి చెప్పారు. ఒక్కసారి సిగ్నల్ పడితే వందలాది వాహనాలు ఆగిపోవాల్సి వస్తుందని చెప్పారు. భవిష్యత్తులో హైదరాబాద్‌లో మరింత ట్రాఫిక్ పెరిగే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా జంక్షన్ల వద్ద ఆకాశంలోనే సపరేటర్స్ నిర్మించాలని చెప్పారు. చాలా అభివృద్ధి చెందిన దేశాల్లో ఇవి ఉన్నాయని అన్నారు. ఎల్‌బి నగర్, ఉప్పల్, బంజారా హిల్స్ పార్క్ చుట్టూ, ఖైరతాబాద్, సెక్రటేరియట్, అంబెడ్కర్ సెంటర్, నక్లెస్‌రోడ్డుకు వెళ్లే చౌరస్తా, అబిడ్స్, చాదర్‌ఘాట్, కోఠి, ఒవైసి హాస్పిటల్, తిరుమలగిరి జంక్షన్, ఆర్‌టిసి క్రాస్‌రోడ్స్, సంగీత్, పారడైజ్ తదితర జంక్షన్ల వద్ద మల్టి లెవల్ గ్రేడ్ సపరేటర్స్ అవసరం ఉందని ముఖ్యమంత్రి అన్నారు. ఎక్కడైనా మెట్రో రైలు లైను అడ్డుగా వస్తే దానిపైనుండి మార్గం నిర్మించాలని కూడా ప్రతిపాదించారు. వీటికి సంబంధించి డిజైన్‌లు, ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు.

---

సిపిఆర్ఓ టు సిఎం